# సంస్థాగత నిర్మాణంపై బిజెపి దృష్టి

## సంక్రాంతి తర్వాత నూతన అధ్యక్ష ఎంపిక

## నేతలతో రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సాల్ భేటీ

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంస్థాగత నిర్మాణంపై ఫోకస్ పెట్టిన తెలంగాణ బిజెపి దృష్టి సారించింది. పార్టీ మండల, జిల్లా కమిటీల ఎన్నికల ప్రక్రియ దిశగా వేగంగా అడుగులేస్తున్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఎంపి, ఎమ్మెల్యేలతో రాష్ట్ర ఇంచార్జి సునిల్ బన్సల్ భేటీ అయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రంలోని బిజెపి జిల్లాల అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ పరిశీలకులు, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జులు, ఎన్నికల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో సంస్థగత ఎన్నికలు, తాజా రాజకీయాలు, భవిష్యత్ కార్యక్రమాలపై సమీక్ష చేశారు.

ఇప్పటికే సంస్థాగతంగా బూత్ కమిటీల ఎన్నికలు పూర్తి చేసుకున్న బిజెపి సంక్రాంతి వరకు మండల, జిల్లా అధ్యక్షుల ఎన్నికలు పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. సంక్రాంతి తర్వాత బిజెపి నూతన అధ్యక్షుడు ఎన్నిక ప్రక్రియ జరుగనుంది. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా వచ్చే నెల 10లోగా మండల కమిటీల ఎన్నికలు పూర్తిచేయాలని, ఆ తర్వాత జిల్లా కమిటీల ఎన్నికలు కొనసాగించాలని బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ రాష్ట్ర పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ నెల 28లోగా క్రియాశీల సభ్యత్వం, పోలింగ్ బూత్ కమిటీల ఎన్నికలు పూర్తి కావాలని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల సభ్యత్వం, 30 వేల క్రియాశీల సభ్యత్వం జరిగిందన్నారు.

మండల, పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటుకు సంబంధించి పార్టీ నిబంధనావళి ప్రకారం పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల నియామకం కూడా పూర్తయ్యిందన్నారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపిలు డికె అరుణ, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, నాగేష్‌తోపాటు ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, వెంకట రమణా రెడ్డి, ధన్ పాల్ సూర్యనారాయణ ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిలో కొద్దిగా మెరుగుదల కన్పిస్తోంది: తండ్రి భాస్కర్

**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 24, ప్రభాతవార్త:** తన కుమారుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిలో కొద్దిగా మెరుగుదల కనిపిస్తున్నదని తండ్రి భాస్కర్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో మీడియా ప్రతినిధులతో శ్రీతేజ్ తండ్రి భాస్కర్ మాట్లాడుతూ సినిమాహాల్‌లోకి ముందుగా తన భార్య, పిల్లలు వెళ్లారన్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో తాను వెళ్లలేకపోయా నన్నారు. అప్పటికే తొక్కిసలాట జరిగి ఓ మహిళ చనిపోయినట్లు తెలిసిందన్నారు. పోలీసులు ఫోన్‌చేసి చెప్పడంతో తాను అక్కడికి వెళ్లి చూసానని అప్పటికే తన భార్య విగతజీవిగా ఉందన్నారు. ఈ ఘటన చూసి తాను నిశ్చేష్టుడనయ్యానన్నారు. తన కొడుకు కూడా అపస్మారక స్థితిలో ఉన్నాడని తెలిసి నిర్ఘాంతపోయినట్లు వెల్లడించారు.

ప్రస్తుతం తన కుమారుడు శ్రీతేజ్‌కు వైద్యులు మంచి వైద్యాన్ని అందిస్తున్నారని, కానీ కోలుకోవడానికి చాలాసమయం పడుతుందన్నారు. బాబు కళ్లు తెరచి చూస్తున్నాడన్నారు. కానీ గుర్తుపట్టడం లేదన్నారు. రెండోరోజు నుండే మీడియా నుంచి తనకు సంపూర్ణమైన మద్దతు లభించిందన్నా రు. అల్లు అర్జున్ నుంచి సానుకూల స్పందన రావడంతో కేసు వావసు తీసుకుంటానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు మైత్రీ మూవీ క్రియేషన్స్ నుంచి రూ 50లక్షలు, ప్రభుత్వం తరుపున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ 25 లక్షలు చెక్కులు అందించారని అన్నారు. అల్లు అర్జున్ వైద్యం కోసం రూ 10 లక్షలు డిడి పంపించినట్లు వివరించారు. వైద్యం కోసం తనను వైద్యులు ఇప్పటివరకు డబ్బులు కూడా అడగడం లేదని భాస్కర్ వివరించారు.

# అశోక్‌నగర్ హాస్టల్‌లో గ్రూప్స్ అభ్యర్థిని ఆత్మహత్య

## 2025 ఫిబ్రవరిలో వివాహం..



సురేఖానాయక్ (ఫైల్)

**హైదరాబాద్ (చిక్కడపల్లి), డిసెంబరు 24, ప్రభాతవార్త:** పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థిని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చిక్క డపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమారం గ్రామానికి చెందిన సురేఖా నాయక్(24). అశోకనగర్ జవహర్‌నగర్‌లోని సాయి ప్రహారియా గర్ల్స్ సూపర్ లగ్జరీ హాస్టల్ రెండో అంతస్తులో ఉంటూ సుమారు ఏడాది కాలంగా గ్రూప్స్ పరీక్షలకు స్థానికంగా శిక్షణ తీసుకుంటోంది. సోమవారం రాత్రి హాస్టల్ గదిలోని ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గుర్తించిన స్నేహితురాళ్లు కిందకు దించి, కొన ఊపిరితో ఉన్న ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో సురేఖ మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పోలీ సులకు సమాచారమివ్వడంతో చిక్కడపల్లి పోలీసు సబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, డిఐ శేఖర్, స్థానిక ఎస్సై మోనిక, క్లూస్‌టీమ్ బృందం సభ్యులు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చా మని.. వారు నగరానికి చేరుకున్న తర్వాతే ఆత్మహత్యకు గల కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. కాగా సురేఖకు గత నెలలోని నిశ్చితార్థం కాగా పెళ్లి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 7న ఫిక్స్ అయింది.

# తొక్కిసలాట దుర్ఘటనను రాజకీయం చేయొద్దు: ఎంపి డికె అరుణ

**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 24, ప్రభాతవార్త:** సంధ్య ధియేటర్ తొక్కిసలాట దుర్ఘటన అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సినీపరిశ్రమపై ప్రభుత్వ వేధింపులుగా భావించాల్సి వస్తుందని మహబూబనగర్ పార్లమెంట్‌సభ్యురాలు డికె అరుణ అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం పరామర్శించి అతని ఆరోగ్యపరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో ఆలోచించకుండా ముగింపు పలకాలని కోరారు.

**ప్రభుత్వమే రాద్ధాంతం చేస్తోంది: మల్కాజ్‌గిరి ఎంపి ఈటల**

కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా, క్రీడా, రాజకీయ ప్రముఖులకు పెద్దఎత్తున అభిమానులు ఉండటం సహజ మేనన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రభుత్వమే దాన్ని రాద్ధాంతం చేస్తోందని అన్నారు.

**నిఘా వైఫల్యమే తొక్కిసలాటకు కారణం: సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి**

నిఘా విభాగం వైఫల్యం చెందడం వల్లే సంధ్య థియేటర్‌లో తొక్కి సలాట ఘటన చోటుచేసుకుందని సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను జూలకంటి రంగారెడ్డితోపాటు పార్టీ ప్రతినిధులు పరామర్శించారు. బాలుడు ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి వారికి ధైర్యం చెప్పారు.

# భారత్ పోల్ ఆన్‌లైన్ వేదికతోనైనా ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను ఇండియాకు రప్పిస్తారా?

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** భారత్‌లో నేరాలు చేసి విదేశాలకు పారిపోయి అక్కడ తలదాచుకుని ఇండియాకు వచ్చేందుకు అయిష్టం చూపుతున్న వారి గురించి తెలిసిందే. ఇందులో విజయ్ మాల్యా, నీరవ్ మోడీలు ముందువరుసలో ఉన్నా తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్‌రావు, మీడియా అధినేత శ్రవణ్ రావు కూడా వున్నారు. వీరిద్దరు ఈ యేడాది ఫిబ్రవరి నెలలో అమెరికాకు పారిపోగా వారు ఉడాయించిన తరువాత ఫోన్ ట్యాపింగ్‌పై సర్కారు కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసింది. ఇందులో ఒక్కరు అనారోగ్య కారణాలతో బెయిల్‌పై వుండగా మిగతా వారు చంచల్‌గూడ జైల్లో వున్నారు. అమెరికాలో వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావులను భారత్‌కు రప్పించేందుకు ఇంటర్ పోల్ సహాయాన్ని కోరారు. వీరిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే సిబిఐ తాజాగా భారత్‌లో తీవ్రమైన నేరాలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకున్న నిందితులను వెనక్కు రప్పించేందుకు ఇంటర్ పోల్‌తో సమన్వయం చేసుకునేందుకు సిబిఐ భారత్ పోల్ అనే ఆన్‌లైన్ వేదికను రూపొందించింది భారత్ లో నేరాలు చేసి విదేశాలకు ఉడాయిస్తున్న నేరగాళ్ల భరతం పట్టేందుకు మరింత సులభమైన ప్రక్రియ కోసం సిబిఐ తాజాగా భారత్ పోల్‌ను రూపొందించింది. మామూ లుగా ఇంటర్ పోల్ ను ఆశ్రయించేందుకు ఆయా రాష్ట్రాలు తమ పరిధిలోని సిఐడి ద్వారా సిబిఐని కోరడం జరుగుతుంటోంది. ఈ ప్రక్రియ అనేక రూపాల్లో సుధీర్ఘ స మయం తీసుకుంటోందనే వాదన వుంది. ఉదాహరణకు అమెరికాకు పారిపోయిన ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావుల విషయాన్నే తీసుకుంటే వీరిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ కోసం రాష్ట్ర పోలీసులు సిఐడి ద్వారా సిబిఐని సంప్రదించి ఐదు నెలలు దాటినా ఇప్పటి వరకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. ఇలా ఎందుకు జరుగుతుందనే దానిపై అధికారులు కూడా స్పష్టమైన సమాధానాలు చెప్పలేక పోతున్నారు. విదేశాలకు పారిపోయిన నిందితుల కోసం రెడ్ కా ర్నర్ నోటీసులు ఇవ్వడం జరుగుతుండగా ఆచూకీ లేని వారికి ఎల్లో నోటీసులు, ఆయా వ్యక్తుల గుర్తింపు కోసం, నివాసం వంటి సమాచారం కోసం బ్లూ నోటీసులు జారీ అవుతుంటాయి. అయితే ఇంటర్ పోల్‌తో సమన్వయం చేసుకునేందుకు సిబిఐ పడుతున్న ఇక్కట్లను దృష్టిలో వుంచుకుని ఈ విభాగం డైరక్టర్ ప్రవీణ్ సూద్ కొత్తగా భారత్ పోల్ అనే ఆన్‌లైన్ వేదికను రూపొందించారు. దీనివల్ల ఇంటర్ పోల్‌తో సంప్రదింపులు జరిపేందుకు, అక్కడి అధికారులతో సమన్వయం చేసుకునేందుకు, ప్రతీ కేసు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుంటుంది. కాగా సిబిఐ కొత్తగా రూపొందించిన భారత్ పోల్ అనే ఆన్‌లైన్ వేదిక ట్రయల్ రన్‌లో వుందని సమా చారం. వచ్చే జనవరి ఏడవ తేదీన ఈ వేదికను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. కాగా ఇంటర్ పోల్ సహకారంతో 2021 నుంచి విదేశాల్లో త లదాచుకున్న 100 మంది వాంటెడ్ నేరగాళ్లను సిబిఐ వెనక్కు తెచ్చింది. కాగా ఇందులో 2024లో 26 మందిని తీసుకువచ్చింది. కాగా భారత్ పోల్ అందుబాటులో వచ్చిన తరువాత అయినా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను భారత్‌కు తెచ్చే ప్రక్రియ వేగం పుంజుకుంటుందా...? అనేది చూడాల్సి వుంది.

# ఫిబ్రవరి 3న 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు'

## వర్గీకరణపై కుట్రలను ఎదుర్కొనేందుకు పోరాటం

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ మీద జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవడానికి ఫిబ్రవరి 3న ఛలోహైదరాబాద్ కార్యక్రమం చేపట్టి 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు'తో మహా ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలి పారు. జనవరి 3 నుండి రాష్ట్రవ్యాప్తంగా రథయాత్రలు ప్రారంభమై ఫిబ్రవరి 3న చలో హైదరాబాద్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నుండి మహా ప్రదర్శన ప్రారంభమై నెక్లెస్‌రోడ్ మీదుగా బయలుదేరి సంజీవయ్య పార్క్ నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు వురు కళాకారులతో కలిసి మంద కృష్ణ మాదిగ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ముప్పై ఏళ్ల సుదీర్ఘమైన పోరాటం చేశామని.. వర్గీకరణ చేస్తామని ముందు కొచ్చిన ప్రతి పార్టీకి మద్దతు తెలిపామన్నారు. తాను ఏ పార్టీలో చేరలేదని భవిష్యత్తులోనూ చేరనన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, ఏపూరి సోమన్న తదితరులు

కాంగ్రెస్‌లో మాలలకు పలుకుబడి ఎక్కువ అని మూడు పదవులు ఉన్న కుటుంబాల్లో గాంధీ కుటుంబం తరువాత మళ్లీ మాలలకే ఉందన్నారు. అందులో ఖర్గే కుటుంబంలో మూడు, వివేక్ కుటుంబంలో మూడు పదవులు ఉన్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి బలమైన ప్రయత్నాలు చేస్తున్నారని ఇన్ని రోజులు తెరవెనుక ఉండి అడ్డుకున్న వాళ్లు ఇప్పుడు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారన్నారు.

**డబ్బులు ఉన్నోళ్ల దగ్గర అధర్మం..**

డప్పులు ఉన్నోళ్ల దగ్గర ధర్మం ఉందని ధర్మమే గెలుస్తుంది, ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుంది. ఈ అంతిమ పోరాటానికి డప్పులతోనే సిద్ధం అవుదామని ముప్పై ఏళ్ల పోరాటంలో కళాకారుల పాత్ర పరిమితంగా ఉందని కానీ అంతిమ పోరాటంలో జాతిని గెలిపించాల్సిన బాధ్యత కళాకారులదేనని మందకృష్ణ పేర్కొన్నారు.

# రూ.10 లక్షలలోపు పెండింగ్ బిల్లులను చెల్లిస్తాం

## బకాయిలు రూ.400 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** రూ. 10 లక్షల లోపు పెండింగ్ లో ఉన్న ప్రజా ప్రతినిధుల బిల్లుల విడుదలకు ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సర్పంచులు, జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు వంటి ప్రజా ప్రతినిధులు 7-12-2023 నాటికి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు సుమారు 1,300 కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. ఇందులో 10 లక్షలు లోపు బకాయిల విలువ సుమారు 400 కోట్ల వరకు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి తో పాటు తాను గమనించి 10 లక్షల లోపు ఉన్న బకాయిలను త్వరలో విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ పెద్దలు స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులతో పనులు చేయించి బిల్లులు పెండింగ్‌లో పెట్టారని, వారిని వీధులపాలు చేశారని ఆరోపించారు.

ప్రజా ప్రతినిధుల ఇబ్బందులకు కారణమైన టిఆర్ఎస్ నేతలు పెండింగ్ బిల్లుల కోసం రోడ్లపైకి వస్తాం, ధర్నాలు చేస్తామని ప్రకటనలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధుల పెండింగ్ బిల్లుల గురించి బీఆర్ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అన్నారు.

# రేవంత్‌రెడ్డి మాటల్లో ఎక్కడా తటస్థత కనిపించలేదు

## ఒకరిని బలిపశువును చేయడం, వేధించడం సరికాదు

## సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

## తమిళనాడు బిజెపి అధ్యక్షుడు అన్నామలై స్పందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై స్పందించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జాతీయ మీడియాతో మాట్లాడుతూ... సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమన్నారు. అయితే చట్టం అందరికీ సమానంగా ఉండాలన్నారు. ఈ ఘటనకు సంబంధించి అల్లు అర్జున్‌పై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరును తప్పుబట్టారు. ఆయన మాటల్లో ఎక్కడా తటస్థత కనిపించలేదని విమర్శించారు. తెలంగాణలో సూపర్‌స్టార్ ఎవరనే విషయంలో అల్లు అర్జున్‌తో రేవంత్ రెడ్డి పోటీ పడేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో నటిస్తున్నారని, తెలంగాణలో ప్రధాన నటుడు ఆయనేనని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరి రచ్చ చేసిన వాళ్లలో ఇద్దరు, ముగ్గురు ఆయన నియోజకవర్గానికి చెందిన వాళ్లేనని, ఇది రాజకీయ దురుద్దేశంతో జరిగిన దాడేనని స్పష్టం అవుతుందన్నారు. సంధ్య థియేటర్ ఘటన రాజకీయ రంగు పులుముకుందని, ఒకరిని బలిపశువును చేయడం, వేధించడం సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. ఒక నిండు ప్రాణం పోవాలని అల్లు అర్జున్ కూడా అనుకోరు కదా అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం పట్ల అన్నామలై హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ప్రతి దానిని రాజకీయం చేయాలని భావిస్తాయని విమర్శించారు.

# యాసంగిలో విత్తనాలు, ఎరువుల కొరత రానీయొద్దు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి సీజనులో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత రానీయెద్దని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులను ఆదేశిం చారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సచి వాలయంలో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల సరఫరాపై నిరం తరం పర్యవేక్షణతో సమ ర్థవంతంగా పంపిణీ జరగా లన్నారు. ఈ యాసంగి సీజనులో ఎరువుల సరఫరాకు పకడ్బందీ ప్రణాళికను రూపొం దించాలని సూచిం చారు. అందుకు తగినట్లుగా కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటాను సకాలంలో వచ్చేలా చూడాలని తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన జనుము, జీలుగ, పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలం సీజనులో పండించిన మొక్కజొన్న, సోయాబీన్, జొన్న, పొద్దు తిరుగుడు వంటను మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మార్క్‌ఫెడ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేసి, వాటి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖలు సమీకృత గోదాముల వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పారు. అందుకుగాను రాష్ట్రంలో అందుబాటులో ఉన్న గోదాములను వినియోగించుకోవాలని తెలియచేశారు. గిడ్డంగుల శాఖ పరిధిలోని గోదాములన్నింటిపైనా సౌర విద్యుత్ ప్యానళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇక రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను అందించేందుకు బ్యాంకర్లు, కంపెనీల సహకారంతో అన్ని జిల్లాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు.

# ఎంపి చామల చొరవతో వెహికల్ అండర్‌పాస్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు మంజూరు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో వెహికల్ అండర్ పాస్, ఫుటోవర్ బ్రిడ్జిలు మంజూరు అయ్యాయి. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో అండర్ పాసులు ఫుటోవర్ బ్రిడ్జిలు కావాలంటూ పార్లమెంట్‌లో వివరించారు. ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ సహాయ మంత్రి అజయ్‌తమ్తా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో జాతీయ రహదారులు 65, 163పై ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం ఆవశ్యకతకు వివరించారు. ప్రమాదాలను నివారించడానికి, వాహనాలు, పాదచారులకు రహదారి భద్రతను మెరుగుపరచడానికి, మంత్రిత్వ శాఖ ఎన్‌హెచ్ కారిడార్ల అభివృద్ధిలో భాగంగా, స్వతంత్ర రహదారి భద్రతా పనులలో భాగంగా వివిధ రహదారి భద్రతా చర్యలను చేపట్టింది. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎన్‌హెచ్163, ఎన్‌హెచ్65లో రహదారి భద్రతను మెరుగుపరచడానికి పలు చర్యలను చేపట్టారు. కొండమడుగు-అంకుషాపూర్‌లో అండర్‌పాస్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు ఘట్‌కేసర్ ఎయిమ్స్ బీబీనగర్ సింగన్నగూడెంలో అండర్‌పాస్‌కు డిపిఆర్ పురోగతిలో ఉంది. టెండరింగ్ ప్రక్రియ/డిపిఆర్ పూర్తయిన తర్వాత ఈ పనులు చేపట్టనున్నారు. అనంతారం జంక్షన్ రామచంద్రపురం వద్ద, రంబుల్ స్ట్రిప్స్, పెడెస్ట్రియన్ గార్డ్ పట్టాలు, సోలార్ బ్లింకర్లు/పవర్ బ్లింకర్లు ఇప్పటికే అందించారు. ఎన్‌హెచ్ 65చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్, వలిగొండ, చిట్యాల, పెద్దకాపర్తి వద్ద వీయూపీ, ధర్మోజిగూడెంలో ఇప్పటికే ఫ్లైఓవర్ నిర్మాణం మంజూరు చేశారు. ఎన్‌హెచ్ ట్రాఫిక్ నుంచి స్థానిక ట్రాఫిక్‌ను వేరు చేయడానికి, పాదచారుల రహదారి భద్రతను మెరుగుపరచడానికి, 8 సంఖ్యలు, వియుపి 17.275 కిలోమీటర్ల పొడవున సర్వీస్ రోడ్, 3 నంబర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు హైదరాబాద్‌లోని 6 లేనింగ్ పనులలో నిర్మాణంలో ఉన్నాయి. ఎన్‌హెచ్ 65 యొక్క విజయవాడ స్ట్రెచ్, కిలోమీటరు 15.00 నుండి 40.00 వరకు (ఎల్‌బి నగర్‌మల్కాపూర్). 4 ఇంకా, పైన పేర్కొన్న ఎన్‌హెచ్‌లలో మానవరహిత రైల్వే క్రాసింగ్ లేదు చౌటుప్పల్‌లోని మల్కాపురం ఆందోల్‌మైసమ్మ దేవాలయంలో భూసేకరణకు సంబంధించి, అదే విధంగా సిఎఎల్‌ఏ ద్వారా దేవాదాయ శాఖకు 18.12.2010 నాటి లెటర్ నంబర్. బి/507/2008 ద్వారా పంపించినట్లు తెలిపారు.

# రాష్ట్ర ప్రజలకు మాజీ సిఎం కెసిఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు,కార్యాచరణ ప్రపంచ మాన వాళిని ఎంతగానో ప్రభావితం చేశాయని అన్నారు. యే నేరము చేయని తనను శిలువకెక్కిస్తున్న పాషాణ హృదయులను కూడా క్షమించమని ప్రభువును వేడుకున్న మహా త్యాగశీలి, అహింసావాది యేసు క్రీస్తు అని కెసిఆర్ కొనియాడారు. పాపులను సైతం క్షమించే ఓర్పు, సహనం, దార్శనికత మానవ సమాజానికి క్రీస్తు చూపిన అత్యద్భుతమైన శాంతి మార్గం అని వ్యాఖ్యానించారు. విశ్వశాంతిని కాంక్షించే పరోపకారులైన ప్రతి ఒక్కరికీ యేసు బోధనలు అనుసరణీయమని, ద్వేషంతో నిండి పోతూ రోజు రోజుకూ స్వార్థ పూరితమవుతున్న మానవ సంబంధాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు క్రీస్తు కార్యాచరణ మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. గంగా జమున సంస్కృతి ఫరిడవిల్లేలా, మత సామరస్యం వెల్లివిరిసేలా సర్వమత సమానత్వాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించి చూపిందని అన్నారు. పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రిస్టియన్ మైనారిటీలకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, పలు కానుకలను అందిస్తూ క్రిస్మస్ పర్వదినాన్ని అధికారికంగా నిర్వహించామని కెసిఆర్ గుర్తు చేశారు.

# కిమ్స్ ఆస్పత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన దిల్‌రాజ్




**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 24, ప్రభాత వార్త:** సికిందరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను సినీపరిశ్రమ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు మంగళవారం పరామర్శించారు. ఇలాం టి ఘటనలు జరగడం బాధాకరమని అన్నారు. సినీపరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి తాను వారధిలా ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. చిత్రపరిశ్రమలో ఇలాంటి ఘటన జరగడం తొలిసారి అన్నారు. బాధిత కుటుంబానికి సినీపరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ నుండి ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. సినీపరిశ్రమ వాళ్లతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వ పెద్దలను త్వరలో కలిసి సమన్వయం చేసుకుంటూ సమస్యకు ముగింపు పలుకుతా మన్నారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తానన్నారు. శ్రీతేజ్ ఆరోగ్యపరిస్థితి మెరుగవుతుందని, కిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యచికిత్సను అంది స్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అతనికి వెంటిలేటర్ తొలగించారని, బాబు పరిస్థితి క్రమక్రమంగా మెరుగవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సినీపరిశ్రమ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

# రాజ్యాంగంపై బిజెపికి అభిమానం లేదు

## కేంద్రమంత్రి అమిత్‌షాను ప్రధాని వెనకేసుకొస్తున్నారు!

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విజయవాడ డిసెంబర్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజ్యాంగంపై బీజేపీక అభిమానం లేదని ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. పార్లమెంట్‌లో డా బీఆర్ అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా అవమానపరిచాడని, ఆయనను ప్రధాని మోడీ వెనకేసుకొస్తున్నారని విమర్శించారు. అమిత్ షాని మంత్రి పదవి నుండి తొలగించాలని డిసెంబర్ 30 వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తాం అని తెలిపారు. ఆదాని అగ్రిమెంట్‌పై అవకతవకలు జరిగాయని రాయటర్స్ పత్రిక రాసిందన , సీఎం చంద్రబాబు కూడా ఆదాని అంశంపై స్పందిం చడం లేదన్నారు. ఆదాని అంశంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదు? అని రామకృష్ణ ప్రశ్నించారు. విజయవాడ దాసరి భవన్‌లో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్, ఇతర నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ డిసెంబర్ 26 నుండి శత వార్షికోత్సవాలు ప్రారంభం అవుతాయి. సీపీఐ శత వార్షికోత్సవ సభ ఖమ్మంలో 2026 డిసెంబర్ 26న జరుగు తుంది. దేశంలో కాంగ్రెస్ సీపీఐ మాత్రమే 100 సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీలు. సంవత్సరం పొడవునా శత వార్షికోత్సవ సభలు జరుగుతాయి. 26 న విజయవాడలో శత వార్షికోత్సవ సభలు జరుగుతాయి అని చెప్పారు. పార్లమెంట్ లో డా బీఆర్ అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్ షా అవమానపరిచారు . ప్రధాన అమిత్ షాని వెనకేసుకొస్తున్నారు.

రాజ్యాంగంపై బీజేపీకి అభిమానం లేదు. రాజ్యాంగ పీఠిక మార్చాలని బీజేపీ ఎంపీ సుప్రీంకోర్టులో కేసు వేశారు. అమిత్ షాని మంత్రి పదవి నుండి తొలగించాలని 30 వ తేదీన దేశ వ్యాప్తంగా ఆందోళన జరుగుతుంది. ఆదాని అగ్రిమెంట్‌పై అవకతవకలు జరిగాయని రాయటర్స్ పత్రిక రాసింది. సీఎం చంద్రబాబు కూడా ఆదాని అంశంపై స్పందించడంలేదు, ఆయన బయపడుతున్నారు. ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి, చిన్న చిన్న అంశాలపై స్పందిస్తున్న సీఎం ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదు ఆదాని అంశంపై పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడంలేదు? చంద్రబాబు నిద్ర పోతు న్నారా? లేక నిద్ర పోయినట్లు నటిస్తున్నారా? ఆదాని అంశంపై చర్యలు తీసుకొనే వరకు సీపీఐ పోరాట చేస్తుంది అని రామకృష్ణ తెలిపారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No. 17/2024-25/SE(WSM&S)/E.E-II (WS-M)/DB/dt.: 21-12-2024.

Number of works - 2 Works, Value of Works (ECV): Rs. 111.84 Lakhs Downloading Starting Date-24-12-2024, Down loading Ending Date: 08-01-2025 Bid submission closing date 08-01-2025, Techniqual Qualification Stage 08-01-2025 Price bid (Commercial stage) 10-01-2025

Note: Further details @ www.apeprocurement.gov.in O/o. EE-II(WSM)-8187898428

For Comessioner

